సాక్షి నిర్మల్

శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023



మొక్కజొన్నకు 'కత్తెర'

మొక్కజొన్న, జొన్న పంటలపై మిచాంగ్ తుపాన్ ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో కత్తెర పురుగు పంటలను దెబ్బతీస్తోంది.

8లో▸

నేడు డయల్ యువర్ డీఎం

నిర్మల్‌చైన్‌గేట్: ఆర్టీసీ ఆధ్వర్యంలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమ రెడ్డి తెలిపారు. సమస్యలు, ఫిర్యాదులు, బస్సు సమయాల్లో మార్పుల కోసం ప్రయాణికులు శుక్రవారం సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు 9959226003 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం
29.5 /16.8

వాతావరణం

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. తుపాను ప్రభావంతో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువగా నమోదవుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కార్డియక్ ఏఈడీపై శిక్షణ



శిక్షణను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

నిర్మల్‌చైన్‌గేట్: కార్డియక్ ఏఈడీ పరికరం ఉపయోగంపై జిల్లాలోని మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌కు సమీకృత జిల్లా అధికారుల సముదాయంలోని డీఎంహెచ్‌వో శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ శిక్షణను డీఎంహెచ్‌వో ధనరాజ్ సందర్శించి మాట్లాడారు. కార్డియక్ అరెస్ట్ కారణంగా గుండె కొట్టుకోవడం ఆగిపోతే, ఈ పరికరం తిరిగి గుండె కొట్టుకోవడానికి సహాయపడుతుందన్నారు. గుండెపోటుకు గురయిన వారిని రక్షించడానికి ఈ పరికరం ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, కార్యక్రమం నిర్వాహణ అధికారి శ్రీనివాస్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, షేక్ అలీమ్, జిల్లాలోని మిడిల్ హెల్త్ ప్రొవైడర్స్ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ హైదరాబాద్ వారిచే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేస్తున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సీ.లింగన్న తెలిపారు. జిల్లా పెన్షనర్ల సంఘ భవనంలో ఉదయం 10:30 గంటలకు ప్రారంభించే కంటి వైద్య శిబిరాన్ని పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు చేసిన తర్వాత అవసరమైన వారికి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తారని తెలిపారు.

రాష్ట్రస్థాయి పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని దివ్యాంగులకు సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు 2023 సంవత్సరానికి రాష్ట్రస్థాయి పురస్కారాలు అందించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత, ఆసక్తి గలవారు ఈనెల 10 లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు wd sc. telangana.gov.inలో లేదా దివ్యాంగుల సంక్షేమ శాఖలో సంప్రదించాలన్నారు.

నేడు జిల్లాకు అయోధ్య అక్షింతలు

నిర్మల్‌చైన్‌గేట్: అయోధ్య రామ జన్మభూమికి సంబంధించిన అక్షింతలు శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రానికి చేరుకుంటాయని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పతికె రాజేందర్ తెలిపారు. అక్షింతల స్వాగత శోభాయాత్ర నటరాజ్‌నగర్‌లోని ఉమామహేశ్వర ఆలయం నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమై దేవరకోట దేవస్థానంకు సాగుతుందని పేర్కొన్నారు. ఈ అక్షింతలు జనవరి ఒకటవ తేదీ నుంచి 21వ తేదీ వరకు జిల్లాలోని ప్రతీ ఇంటికి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. 22వ తేదీన అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం ఉంటుందని హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీరామచంద్రుని కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

'ఆత్యాపాత్య' కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన సభ్యులు

నిర్మల్ రూరల్: ఆత్యాపాత్య గేమ్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనికి 16 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. అధ్యక్షుడిగా వన్నెల భూమన్న, కార్యదర్శిగా సంజీవ్, కోశాధికారిగా జమున ఎన్నికయ్యారు. రాబోయే ఒలింపిక్స్‌లో ఈ ఆటను నూతనంగా చేర్చారని అధ్యక్షుడు భూమన్న తెలిపారు. జిల్లాలో ఈ ఆట బలోపేతానికి కృషి చేస్తామన్నారు. డీవైఎస్‌వో నఫీఖాన్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రమణారావు, తైక్వాండో ఉమ్మడి అధ్యక్షుడు రామారావు, సాఫ్ట్ బాల్ కార్యదర్శి అన్నపూర్ణ, నెట్‌బాల్ కార్యదర్శి గంగాధర్, కెటా కార్యదర్శి భోజన్న, పీఈటీలు పాల్గొన్నారు.

దశ మారేనా?



- నిర్మల్ అభివృద్ధిపై ఆశలు!
- కొడంగల్‌తో సమానంగా చేస్తానన్న రేవంత్‌రెడ్డి
- బల్దియా మాస్టర్‌ప్లాన్, దొంగ జీవోల రద్దుకు హామీ..
- స్మార్ట్ సిటీ చేస్తామన్న 'ఏలేటి'
- సీఎం కోసం ఎదురుచూస్తున్న బాసర

నిర్మల్: 'డిసెంబర్ 9న తెలంగాణలో ఏర్పడేది కాంగ్రెస్ సర్కారే. మేము అధికారంలోకి రాగానే నా కొడంగల్ నియోజకవర్గంతో సమానంగా నిర్మల్‌ను అభివృద్ధి చేసే బాధ్యత నేనే తీసుకుంటా. దొడ్డిదారిన జీవోలు తెచ్చి నిర్మల్‌లో మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తున్నారు. పేదల భూములను కొల్లగొట్టే ప్లాన్ చేస్తున్నారు. మేము అధికారంలోకి రాగానే రద్దు చేస్తాం..' అని గతనెల 15న నిర్మల్‌లో నిర్వహించిన ఎన్నికల సభలో టీపీసీసీ చీఫ్ హోదాలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆయన అన్నట్లుగానే అధికారంలోకి వచ్చారు. ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. ఇక తన కొడంగల్‌తోపాటుగా నిర్మల్‌ను అభివృద్ధి చేస్తానని చెప్పిన మాటలు, జిల్లాను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతానని ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చుతాయా అన్న చర్చ జరుగుతోంది. ఎందుకంటే నిర్మల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు ఓడిపోయారు. అయితే కాంగ్రెస్ నేతలు మాత్రం తమ ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నెరవేరుస్తారని, కచ్చితంగా జిల్లా అభివృద్ధికి పాటుపడతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మల్‌కు అదృష్టమేనా..!

సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత తన నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతానని పలుమార్లు చెప్పారు. తన నియోజకవర్గంతోపాటు నిర్మల్‌నూ అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడు స్థానికులు ఇదే అంశంపై చర్చించుకుంటున్నారు. నిర్మల్ నియోజకవర్గంతోపాటు జిల్లా అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. మరోవైపు బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచిన మహేశ్వర్‌రెడ్డి సైతం ప్రధాని మోదీ సభలో నిర్మల్‌ను స్మార్ట్‌సిటీ చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్రం నుంచి నిధులు తీసుకువస్తామన్నారు. ఈనేపథ్యంలో ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు కేంద్రం రెండింటి నుంచి భారీగా నిధులు వస్తే నిర్మల్ రూపురేఖలే మారిపోతాయి.

పేదలకు ఇళ్లు..

జిల్లాలో ఇప్పటికీ అర్హులైన పేదలందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు అందలేదు. ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంటిస్థలం ఉన్నవాళ్లకు రూ.5 లక్షల ఆర్థి కసాయం చేస్తామన్నారు. ఈక్రమంలో తమకు హా మీ ఇచ్చిన రేవంత్‌రెడ్డే ముఖ్యమంత్రి కావడంతో పే ద కుటుంబాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు కూడా ఉండటంతో ఈ పథకం కచ్చితంగా అమలు కానుంది. జిల్లాలో ఇప్పటికీ పలు మండలాల్లో డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. వాటిని కూడా పూర్తిచేసి పంపిణీ చేయాలని అర్హులు కోరుతున్నారు.

మాస్టర్‌ప్లాన్ రద్దుపై..

నిర్మల్ నియోజకవర్గంలో మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఓడించడంలో ఇక్కడి మాస్టర్‌ప్లాన్ అంశమే ప్రధానపాత్ర పోషించింది. మాస్టర్‌ప్లాన్ ప్రభావిత ప్రాంతాల ఓటర్లు మొత్తం బీజేపీకే మద్దతు తెలిపారు. మాస్టర్‌ప్లాన్ రద్దు కోసం ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే ఏలేటి నిరాహారదీక్ష చేపట్టడం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ ఎన్నికల సభలోనూ రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి రాగానే మాస్టర్‌ప్లాన్‌ను, దొంగజీవోలను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఇటు ఎమ్మెల్యేగా మహేశ్వర్‌రెడ్డి గెలువడం, అటు ఏకంగా ఎవరైతే మాస్టర్‌ప్లాన్ రద్దుకు హామీ ఇచ్చారో ఆయనే సీఎం పదవి చేపట్టడంతో మరోసారి ఈ విషయం తెరపైకి వచ్చింది. చాలామంది రైతులు, భూయజమానులకు ఇబ్బందికరంగా మారుతుందన్న మాస్టర్‌ప్లాన్‌ను పూర్తిగా రద్దు చేయిస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

ఎదురుచూస్తున్న బాసర..

దక్షిణ భారతదేశంలోనే ఏకైక సరస్వతీ క్షేత్రం బాసర. పదేళ్ల బీఆర్‌ఎస్ హయాంలో రూ.50 కోట్లు కేటాయించినట్లు చెబుతున్నా.. ఇప్పటికీ అక్కడ ఇంకా సమస్యలు మిగిలే ఉన్నాయి. బాసర జ్ఞానసరస్వతీ క్షేత్రాన్ని సైతం యాదాద్రి తరహాలో అభివృద్ధి చేయాలన్న డిమాండ్ ఉంది. మరోవైపు బాసరలోనే ఉన్న మరో చదువుల క్షేత్రం ఆర్జీయూకేటీ(ట్రిపుల్ ఐటీ). ఇక్కడి పరిస్థితులు, ఏళ్లుగా విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు, ప్రాంగణంలో పేరుకుపోయిన సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి పూర్తి అవగాహన ఉంది. గతేడాది ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులు రోజులతరబడి చేసిన ఆందోళనల సందర్భంగా రేవంత్‌రెడ్డి పోలీసుల కళ్లుగప్పి, ఏకంగా గోడదూకి క్యాంపస్‌లోకి వచ్చారు. ఇక్కడి విద్యార్థులకు సంఘీభావం ప్రకటించారు. ఏడాది గడిచినా ఇప్పటికీ ట్రిపుల్‌ఐటీ పరిస్థితులు మారలేదు. ఇటీవలే మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలాంటి పరిస్థితులు లేకుండా.. ఆర్జీయూకేటీని దేశంలోనే ఉన్నతమైన విద్యాసంస్థగా తీర్చిదిద్దుతారని నూతన ముఖ్యమంత్రిపై విద్యార్థులు ఆశలు పెట్టుకున్నారు.

తొలి విడతలో దక్కని చోటు

- మంత్రివర్గంలో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం కరువు
- రెండో దఫా విస్తరణపైనే ఆశలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ సర్కారులో తొలి రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎవరికీ చోటు దక్కలేదు. రాష్ట్రంలో హైదరాబాద్, ఉమ్మడి జిల్లా నుంచి మినహా అన్ని చోట్ల ప్రాతినిధ్యం కల్పించారు. మొదటి కేబినెట్ విస్తరణలోనే ఒకరికైనా చోటు ఖాయమని అంతా భావించారు. గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార సమయంలోనే మరో 11మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సాయంత్రం తొలి కేబినెట్ సమావేశం కూడా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, ఖానాపూర్ నియోజకవర్గాల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వినోద్, గడ్డం వివేక్, వెడ్మ బొజ్జు ఉన్నారు. వీరిలో ఒకరికి కచ్చితంగా వీలుంటే ఇద్దరికీ మంత్రివర్గంలో చోటు ఖాయమని హామీలు వచ్చాయి. ఎమ్మెల్యేలు సైతం ఇదే విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికీ మొదటి మంత్రివర్గ విస్తరణలో అవకాశం రాలేదు. రాష్ట్ర మంత్రివర్గంలో సీఎంతో సహా మొత్తం 18మంది మంత్రి వర్గంలో ఉండొచ్చు. ప్రస్తుతం సీఎంతో కలిపి మొత్తం 12మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇక మిగిలిన ఆరుగురు మంత్రుల్లోనే ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు లేదా ఇద్దరికి అవకాశం దక్కవచ్చు. ఈ క్రమంలో రెండో విడత కేబినెట్ విస్తరణలో ఎవరికి చోటు దక్కుతుందోనని చర్చ నడుస్తోంది. ఇక స్పీకర్‌గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ ఎంపిక చేసిన క్రమంలో డిప్యూటీ స్పీకర్‌గా మరొకరికి అవకాశం ఇవ్వొచ్చు. వీటితోపాటు మంత్రి తర్వాత కేబినెట్ హోదా కలిగిన చీఫ్ విప్, విప్ పదవులు ఉంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సామాజిక తూకంలో భాగంగా ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాల నుంచి ఎంపిక చేశారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి మంత్రి రేసులో ఉన్న ప్రేమ్‌సాగర్‌రావుతోపాటు గడ్డం సోదరులు, వెడ్మ బొజ్జుకు కూడా తగిన ప్రాధాన్యత ఉంటుందని పార్టీ అధిష్టానం నుంచే ఇప్పటికే హామీలు వచ్చాయి. రెండో దఫా మంత్రివర్గ విస్తరణ పూర్తయితేనే ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికి చోటు ఉంటుందనే తేలనుంది.

ఇక 'పంచాయతీ' పోరు

- సర్పంచ్ ఎన్నికలకు అధికారుల కసరత్తు
- 54 రోజుల్లో ముగియనున్న పదవీ కాలం
- గత ఎన్నికల రిజర్వేషన్లు, అధికారుల వివరాలు అడిగిన ఈసీ



నిర్మల్‌చైన్‌గేట్: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పంచాయతీరాజ్ శాఖ కసరత్తు ప్రారంభించింది. సర్పంచుల పదవీకాలం మరో 54 రోజుల్లో ముగియనుంది. దీంతో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన రిటర్నింగ్ అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది వివరాలను సేకరించాలని సూచించింది. ఈ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని పేర్కొంది. అధికారులను గుర్తించేందుకు అవసరమైన మార్గదర్శకాలను జారీ చేసింది. పంచాయతీ అధికారులు ప్రక్రియ మొదలు పెట్టారు.

మొదలుకానున్న సందడి..

రిజర్వేషన్ల ప్రక్రియ లేకపోవడంతో అధికారులకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఓటర్ల జాబితాను సవరించాల్సి ఉంది. ఇదిలా ఉండగా 200 మంది ఓట ర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారి, 400 మంది ఓటర్ల వరకు ఉంటే ఒక ప్రిసైడింగ్ అధి కారి తోపాటు ఇద్దరు పోలింగ్ అధికారులు, 650 మంది వరకు ఓటర్లు ఉంటే ఒక ప్రిసైడింగ్ అధికారితోపాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించాల్సి ఉంది. ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులుగా వ్యవహరించేవారి పేర్లు, ఎంప్లాయ్ ఐడీ, హోదా, సెల్ నంబర్, పనిచేసే శాఖ, ప్రాంతం ఇలా వివరాలు నమోదు చేసి ఎన్నికల సంఘానికి నివేదిక పంపాల్సి ఉంది. పంచాయతీ ఎన్నికల కసరత్తు అధికారికంగా మొదలు కావడంతో గ్రామాల్లోనూ ఎన్నికల సందడి మొదలు కానుంది.

ఫిబ్రవరి 1 వరకు పదవీకాలం

ప్రస్తుత సర్పంచుల పదవీ కాలం వచ్చే ఏడాది ఫిబ్రవరి 1వ తేదీతో ముగియనుంది. ప్రస్తుతం పదవుల్లో ఉన్న సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు స భ్యుల్లో 50 శాతం మంది మరోసారి పోటీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. జిల్లాలో 2019లో మూడు విడతల్లో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించారు. జనవరి 25, 28, 31 తేదీల్లో పోలింగ్ జరిగింది. అదే రోజు ఫలితాలు ప్రకటించారు. ఈసారి కూడా మూడు విడతల్లో పంచాయతీ ఎన్ని కలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

వివరాలు..

మొత్తం మండలాలు	19
గ్రామపంచాయతీలు	396
వార్డులు	3325
మొత్తం ఓటర్లు	3,63,341
పురుషులు	1,74,374
మహిళలు	1,88,967

అవే రిజర్వేషన్లు..

వచ్చే ఏడాది నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 2019 నాటి రిజర్వేషన్లు అమలు కానున్నాయి. రిజర్వేషన్లు అమలులోకి వచ్చిన నాటి నుంచి 10 ఏళ్ల వరకు అమలులో ఉంటాయని ప్రభుత్వం ప్రత్యేక జీవో తీసుకువచ్చింది. దీంతో అన్ని గ్రామాల్లో ఆశావహులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఇప్పటి నుంచే రంగంలోకి దిగారు.

భవితను తేల్చి.. భద్రంగా గోదాములకు..



పొలిటికల్ పార్టీల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలు తరలించిన కలెక్టర్, జిల్లా అధికారులు(ఫైల్)

- పూర్తయిన అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ
- ఈవీఎంలు, వీవీ ప్యాట్లను భద్రపర్చిన అధికారులు
- ఆరు నెలలపాటు సమాచారం నిల్వ

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థుల భవితవ్యం తేల్చిన ఈవీఎంలు భద్రంగా గోదాములకు చేరాయి. జిల్లాలో మూడు నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. వీటిని విజయవంతంగా చేపట్టేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేశారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్ శాఖలతోపాటు విద్యాశాఖ సిబ్బంది కీలకంగా పని చేశారు. అక్టోబరు 9న ఎన్నికల తేదీలు ప్రకటించిన నాటి నుంచి ఆదివారం ఓట్ల లెక్కింపు వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తోపాటు జిల్లా ఎన్నికల పరిశీలకులు ఎప్పటికప్పుడు సిబ్బందితో సమీక్షిస్తూ రాష్ట్ర అధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ ఈ ప్రక్రియను విజయవంతం చేయడంలో సఫలమయ్యారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌సెల్, ఫిర్యాదుల కేంద్రం, మీడియా పాయింటు ఏర్పాటు చేయడంతోపాటు ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

మూడు విడతల్లో ర్యాండమైజేషన్..

ప్రజాప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని మూడు విడతల్లో చేపట్టారు. నవంబరు 30న ఎన్నికల సందర్భంగా మూడు నియోజకవర్గాల్లోని 519 పోలింగ్ లొకేషన్లలో 922 పోలింగ్ కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు చేశారు. ఈవీఎంల తరలింపు, తిరిగి గోదాముల్లో భద్రపరిచే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టారు.

8 కంపెనీలతో..

జిల్లాలో ఉన్న పోలీసు ఫోర్స్‌తోపాటు వివిధ రాష్ట్రాల నుంచి 8 కేంద్ర కంపెనీలకు చెందిన పోలీసులు ఎన్నికల వేళ విధులు నిర్వహించి నట్లు పోలీసు శాఖ అధికారిక గణాంకాలు న్నాయి. అక్టోబర్ నుంచి సుమారు 1000 మంది పోలీసులు, 700 మంది కేంద్ర బలగా లు, 100 పెట్రోలింగ్ పార్టీలు విధులు నిర్వహించారు. మహారాష్ట్ర హోంగార్డులు, బీఎస్ ఎఫ్ రైల్వే ఫోర్స్ పోలింగ్ ముందు జిల్లాలో భద్రత చర్యల్లో ఉన్నారు. వీరందరినీ జిల్లా సివిల్, ఏఆర్ విభాగం పోలీసులు సమన్వ యం చేశారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారి ఎస్పీ సీఎచ్.ప్రవీణ్ కుమార్ ఎప్పటికప్పుడు సూచనలు చేసి ప్రచారం, పోలింగ్, లెక్కింపు ప్రక్రియ శాంతియుతంగా జరగడంలో విజ యవంతమయ్యారు. ఎన్నికలు ముగియడంతో కొందరు ఈనెల 3న వెళ్లగా.. మరికొన్ని బలగాలు సోమవారం వారి స్వస్థలాలకు వెళ్లినట్లు అధికారులు వెల్లడించారు.

పోస్టల్ బ్యాలెట్‌లోనూ బీజేపీనే..

- ఉద్యోగులు, జర్నలిస్టులు, సర్వీస్ ఓటర్ల వినియోగం
- మూడు నియోజకవర్గాల్లోనూ కమలానికే ఆధిక్యం



నిర్మల్ ఖిల్లా: పోస్టల్ బ్యాలెట్ వినియోగంలోనూ ఈసారి బీజేపీకి ఆధిక్యత లభించింది. జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల పరిధిలోని పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు, సర్వీస్ ఓటర్లు, సీనియర్ సిటిజెన్లు వినియోగించుకున్నారు. ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో దాదాపు 5,575 ఓట్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోగా.. బీజేపీకి నిర్మల్ నియోజకవర్గంలో 1715, ముథోల్ నియోజకవర్గంలో 751, ఖానాపూర్ నియోజకవర్గంలో 880 ఓట్లు వచ్చాయి. నిర్మల్, ముథోల్ నియోజకవర్గాలలో బీజేపీ విజయం సాధించగా.. ఖానాపూర్ నియోజకవర్గంలో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందారు.

నియోజకవర్గాల వారీగా పోలయిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

నియోజకవర్గం	పోలయిన మొత్తం ఓట్లు	బీజేపీ	బీఆర్ఎస్	కాంగ్రెస్
నిర్మల్	2,519	1,715	376	338
ముథోల్	1,229	751	335	99
ఖానాపూర్	1,827	880	247	660

బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

భైంసారూరల్: రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి నిషిత, ఏడో తరగతి విద్యార్థి శశికాంత్ ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు సరిత గురువారం తెలిపారు. మంచిర్యాలలో బుధవారం జరిగిన అండర్–14 బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కస్బా విద్యార్థులు

నిర్మల్ రూరల్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన అండర్– 14 రగ్బీ పోటీల్లో జిల్లా కేంద్రంలోని కస్బా ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. 8వ తరగతి చదివే సాయిచంద్, విగ్నేశ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు వాణి, ఎన్‌సీసీ అధికారి సాయన్న, వ్యాయామ ఉపాధ్యాయుడు భూమన్న, ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

ముథోల్: మండలంలోని అష్టా గ్రామం పాఠశాలకు చెందిన 9 మంది బాలికలు రాష్ట్రస్థాయి అండర్–18 ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం రమణారెడ్డి తెలిపారు. విద్యార్థులను వీడీసీ తరఫున గురువారం అభినందించారు. క్రీడాకారులకు యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుకన్య, వీడీసీ చైర్మన్ సాయిరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫాంలు అందజేస్తున్న వీడీసీ

పెంబి మండల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా ఆస్పిరేషన్ జిల్లాగా పెంబి మండలాన్ని గుర్తించిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వానతెలిపారు. ఈ మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి టాప్ ర్యాంక్ సాధించాలని సూచించారు. సమీకృత కలెక్టరేట్‌లోని మినీ సమావేశమందిరంలో ఆయా శాఖల అధికారులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం విద్య, వైద్యం, ఐసీడీఎస్ ఆరోగ్యపోషణ, చదువు, వ్యవసాయం, నీటి వనరులు, నైపుణ్యాభివృద్ధి, రహదారి, తాగునీరు, గ్రామీణ విద్యుదీకరణ, వ్యక్తిగత మరుగుదొడ్లతోసహా ప్రాథమిక మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఉద్దేశించిన నీతి ఆయోగ్ కార్యక్రమాన్ని పెంబి మండలం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జెడ్పీటీసీ పదవికి అనిల్‌జాదవ్ రాజీనామా



అనిల్‌జాదవ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బోథ్ ఎమ్మెల్యేగా ఎన్నికైన అనిల్‌జాదవ్ నేరడిగొండ జెడ్పీటీసీ పదవికి రాజీనామా చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం అనిల్ జాదవ్ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్నను పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామన్న అనిల్‌జాదవ్‌ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఉన్నత విద్యాసదస్సులో ఆర్జీయూకేటీ వీసీ



మాట్లాడుతున్న వీసీ వెంకటరమణ

భైంసా(ముధోల్): హైదరాబాద్‌లో గురువారం జరిగిన ఉన్నత విద్యా సదస్సులో ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సంప్రదాయ విద్యకు మించిన కొత్త నైపుణ్యాలు, జ్ఞానాన్ని పొందే అలవాటును పెంపొందించుకోవాలన్నారు. స్థిరమైన అభ్యాసతత్వానికి కట్టుబడి ఉండాలన్నారు. కెరీర్ పురోగతికి ఒక ప్రయోజనకరమైన సాధనం అవుతుందన్నారు. బాసర ఆర్జీయూకేటీని ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపడుతున్నామన్నారు.

విద్యుత్ షాక్‌తో మూగజీవాలు మృతి



మృతి చెందిన గేదెలు

లక్ష్మణచాంద(నిర్మల్): విద్యుత్‌షాక్‌తో రెండు గేదెలు, ఒక పెంపుడు కుక్క మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఎల్లన్న, మహేందర్ అనే రైతులకు చెందిన రెండు గేదెలు గురువారం ఉదయం గ్రామ సమీపంలోకి మేతకు వెళ్లాయి. మేత మేసేక్రమంలో విద్యుత్ తీగ తెగి పడటంతో రెండు గేదెలు, అజయ్ అనే వ్యక్తికి చెందిన పెంపుడు కుక్క అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కో గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఆదివాసీ గూడెం నుంచి అసెంబ్లీకి..

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రస్థానం
- స్వగ్రామం ఉట్నూర్ మండలం కల్లూర్‌గూడ
- కష్టపడి చదివించిన తల్లిదండ్రులు
- ఆదివాసీ హక్కుల కోసం పోరాటం..
- రేవంత్‌రెడ్డికి అనుచరుడిగా గుర్తింపు..
- ఎన్నికల్లో గెలుపొందడంపై గ్రామస్తుల హర్షం



ఇందిరమ్మ ఇంటి ఎదుట బొజ్జు కుటుంబ సభ్యులు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): కొండకోనల్లో విసిరి పడేసినట్లు ఉన్న చిన్నపాటి గ్రామం కల్లూరుగూడ. ఉట్నూర్ మండలం ఘన్‌పూర్ గ్రామ పంచాయితీ పరిధిలో ఈ గ్రామం వెలిసింది. గ్రామంలో 25 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందిన వెడ్మ బొజ్జు పటేల్ ఈ గ్రామానికి చెందిన వాడే. చిన్నపాటి గ్రామంలో ఇందిరమ్మ ఇంట్లో బొజ్జు కుటుంబం నివాసం ఉంటోంది. తల్లిదండ్రులు గిరిజాబాయి, భీంరావు దంపతులు వ్యవసాయం చేస్తూ కష్టపడి బొజ్జును చదివించారు. తమ కొడుకు బాగా చదివి ఉన్నతంగా రాణించాలని ఆ తల్లిదండ్రులు కన్న కలలు నేడు నెరవేరాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బొజ్జు గెలుపొందడంతో గూడెంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్తులతో పాటు కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కష్టపడే తత్వం ఉంది



మా కుమారుడు బొజ్జుకు చిన్ననాటి నుంచి కష్టపడే తత్వం ఉంది. ఇంటి వద్ద ఎప్పుడూ ఖాళీగా ఉండేవాడు కాదు. అతని కష్టానికి ఎప్పుడూ వెన్నంటి ఉన్నాం. ఆదివాసీలకు హక్కులు కల్పించేందుకు కృషి చేస్తుండేవాడు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంద్రవెల్లిలో నిర్వహించిన సభలో బొజ్జుకు ప్రజల్లో ఉన్న ఆదరణను రేవంత్‌రెడ్డి గుర్తించి ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇచ్చారు. ప్రజలు ఓటు వేసి గెలిపించడం సంతోషం కలిగించింది.

– వెడ్మ భీంరావు, బొజ్జు తండ్రి

సంతోషంగా ఉంది



మా కొడుకు ఎమ్మెల్యేగా గెలిచాడని తెలిసి మేము, మా గ్రామస్తులు ఎంతో సంతోషపడ్డాం. ఎప్పుడూ ఈ ప్రాంత గిరిజనుల అభివృద్ధి కోసం ఆలోచిస్తూ ఉండేవాడు. ఎన్నికల్లో గెలవడంతో ఈప్రాంత ప్రజలకు న్యాయం చేస్తాడని, వారి సమస్యలు పరిష్కరిస్తాడని ఆశిస్తున్నాం. బొజ్జు గెలుపొందడంతో రోజూ ఎవరో ఒకరు వచ్చి మాకు శుభాకాంక్షలు తెలపడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది.

– గిరిజాబాయి, బొజ్జు తల్లి

హక్కులకోసం పోరాడుతుండేవారు



నేను కుమురంభీం జిల్లాలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్నా. ముందు నుంచీ మా ఆయనకు కష్టపడే గుణం ఉంది. ఎప్పుడూ ఈ ప్రాంత ఆదివాసీల హక్కుల సాధనకోసం పోరాడుతుండే వారు. రాత్రి వరకూ ఇంటికి వచ్చే వారు కాదు. ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయనకు మంచి అవకాశం లభించింది. ఈ ప్రాంత అభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తాడని ఆశిస్తున్నాం.

– ద్రుపద, బొజ్జు సతీమణి

మొక్కజొన్నను ఆశిస్తున్న కత్తెర పురుగు

- పలు గ్రామాల్లో పంటలు పరిశీలించిన ఏఈవో
- సాక్షి కథనానికి స్పందన



మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న ఏఈవో శ్రీవాణి

దిలావర్‌పూర్(నిర్మల్): మొక్కజొన్న, జొన్న పంటలపై మిచాంగ్ తుపాన్ ప్రభావం చూపుతోంది. 'పంటలపై మిచాంగ్ పంజా' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం మండలంలోని గుండంపల్లి క్లస్టర్ పరిధిలోని గుండంపల్లి, సముందర్‌పల్లి, కాండ్లి గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలను ఏఈవో శ్రీవాణి పరిశీలించి తగు సలహాలు, సూచనలు అందించారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో పంటలను చీడపీడలు ఆశిస్తాయని, రైతులు గమనించి నివారణ చర్యలు చేపడితే అదుపులో ఉంటాయన్నారు. కానీ ఇప్పటికే రెండుమూడు సార్లు మందులు పిచికారీ చేసినా పురుగులు అదుపులోకి రావడంలేదని గుండంపల్లి గ్రామానికి చెందిన రైతు అనుముల మహేశ్ పేర్కొన్నారు. మొక్కకు ఎండతో పాటు సస్యరక్షణ చర్యలు చేపడితే చీడపీడలను అదుపులోకి తీసుకు రావచ్చని ఏఈవో పేర్కొన్నారు. ముఖ్యంగా మొక్కకు తెగులు ఆశిస్తున్నాయని, 150 లీటర్ల నీటికి 100 గ్రాముల కొరాజిన్ లేదా ఎమామెక్టాన్ బెంజోయేట్ కలిపి ఎకరా విస్తీర్ణంలో పిచికారీ చేయాలని సూచించారు. నెల రోజుల పంటలో పురుగు తీవ్రత అధికంగా ఉండి కాండాన్ని తొలుస్తుంటే కార్బోఫ్యూరాన్ 3 నుంచి 5 గుళికల చొప్పున మొక్కకు మొగిలో వేయాలని సూచించారు. నిత్యం పంటను గమనిస్తూ సస్యరక్షణ చర్యలు చేపడితే పంటలు ఆశాజనకంగా ఉండి ఆశించిన దిగుబడి వస్తుందని ఆమె పేర్కొన్నారు.

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి

- తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్



మాట్లాడుతున్న గోడం గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కుమురంభీం కాలనీలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1981 ఏప్రిల్ 20న వీరమరణం పొందిన ఆదివాసీ అమరుల స్థూపాన్ని అమర వీరుల స్మృతి వనంగా ఏర్పాటు చేస్తామన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత పాలకులు ఇంద్రవెల్లి అమరులు, వారి కుటుంబాలను గుర్తించకపోవడం బాధాకరమ న్నారు. వారిని ఆదుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలోని మావల మండలం కొమురంభీం కాలనీ సర్వేనంబర్ 72/23లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న 1500 మంది ఆదివాసీలకు పట్టాలివ్వాలని పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు. జానెడు జాగ కోసం ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు ఆదివాసీలు పోరుబాట పట్టారని గుర్తు చేశారు. జిల్లా ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, మావల మండల అధ్యక్షుడు ఆత్రం గణపతి, ఆదివాసీ నాయకులు ఆత్రం భుజంగ్, గోడం జంగుబాయి పాల్గొన్నారు.

క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య



కవిత (ఫైల్)

ఇంద్రవెల్లి(ఖానాపూర్): క్షణికావేశంలో పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ముత్నూర్‌లో చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం బోథ్ మండలంలోని వజ్జర గ్రామానికి చెందిన కవిత (26)కు ఇంద్రవెల్లి మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన గేడం జ్యోతిరాంతో 2021లో వివాహమైంది. గురువారం ఉదయం జ్యోతిరాం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. క్షణికావేశంలో కవిత ఇంట్లో ఉన్న గుర్తు తెలియని పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలు తండ్రి సిడాం లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

తాంసి(బోథ్): జీవితం విరక్తితో ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భీంపూర్ మండలంలోని గోముత్రి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కినాకే గజానన్ (32) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య కొన్ని రోజులుగా ధనోరాలోని పుట్టింట్లో ఉంటోంది. ఈ క్రమంలో మద్యానికి బానిసైన గజానన్ బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై లాల్ సింగ్ నాయక్ మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. భార్య కొమాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

నేరడిగొండ(బోథ్): మద్యం మత్తులో ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని శంకరాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం శంకరాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ శేఖర్ (26) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. బుధవారం ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడి ఇంటినుంచి వెళ్లగొట్టాడు. రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం భార్య ఇంటికెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మృతుని భార్య ప్రీతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

నేడు జోనల్‌స్థాయి ఎంపిక పోటీలు

నిర్మల్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్‌స్థాయి అండర్–14, అండర్–17 టెన్నికాయిట్ ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ రమణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సోన్ మండలంలోని కడ్తాల్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు సంబంధిత ప్రధానోపాధ్యాయుడు లేదా ప్రిన్సిపాల్ సంతకంతో కూడిన 4 ఎలిజిబిలిటీ ఫారాలు, బోనాఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాల కోసం పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు మంగ శారపు వెన్నెలను 9908963333 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తానూరు(ముధోల్): మండలంలోని బెల్‌తరోడా శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గురువారం ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి రూ.50,120 నగదుతో పాటు ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బ్రెయిన్ ట్యూమర్‌తో బాలుడు మృతి



రిషి (ఫైల్)

లక్ష్మణచాంద(నిర్మల్): బ్రెయిన్ ట్యూమర్‌తో బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని నర్సాపూర్‌లో చోటు చేసుకుంది. నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామానికి చెందిన లక్ష్మి, రాజేశ్వర్ దంపతుల ఏకైక కుమారుడు రిషి (12) రెండేళ్లుగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. పలుమార్లు సిజేరియన్ చేయించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. రెండు నెలల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు.

ఉన్న ఒక్కడూ కానరాని లోకాలకు...

రెండేళ్లుగా బాలునికి వైద్యచికిత్స కోసం అప్పులు చేసి దాదాపు రూ.15 నుంచి రూ. 20 లక్షల వరకు ఖర్చు చేశారు. వారు చేసిన శ్రమంతా వృథా అయ్యింది. ఉన్న ఒక్క కుమారుడు కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ దంపతులు రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.

ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా నడవాలి

- ఎంపీ సోయం బాపూరావు
- సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు



సోయం బాపూరావు

ఆదిలాబాద్: తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాలని ఎంపీ సోయం బాపూరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి, మంత్రివర్గానికి అభినందనలు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. సంక్షేమాన్ని పట్టించుకోలేదని, మార్పుకోసం ప్రజలు ఈ ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటువేసి బీఆర్‌ఎస్ పార్టీని ఓడించారన్నారు. నూతన సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఇంద్రవెల్లిలో స్మారక వనాన్ని ఏర్పాటు చేసి ఆదివాసీల హక్కులను కాపాడాలన్నారు. ఆదివాసీల ప్రధాన సమస్య అయిన పోడు భూములకు పట్టాలు, మారుమూల గ్రామాలకు కనీస వసతులు కల్పించాలని కోరారు.

అటవీ అధికారులతో ఆదివాసీల వాగ్వాదం



ఆదివాసీలతో మాట్లాడుతున్న అధికారులు

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని గొండుగూడ ఆదివాసీలు అటవీ అధికారులతో గురువారం వాగ్వాదానికి దిగారు. కొన్నేళ్లుగా తాము సాగు చేస్తున్న పోడు భూములను పునరావాసం కింద మండలంలోని రాంపూర్, మైసంపేట్ గ్రామస్తులకు కేటాయించడం సరికాదన్నారు. తమకు పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గొండుగూడ వాసుల డిమాండ్‌ను అటవీ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారి నిర్ణయం మేరకు పనులు చేపడతామని ఎఫ్‌ఆర్వో అనిత తెలిపారు.

సాయిబాబా ఆలయంలో దీపోత్సవం



దీపోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని గండి రామన్న సాయిబాబా ఆలయంలో గురువారం సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 11,116 దీపాలను వెలిగించారు. ఆలయ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఏటా కార్తీకమాసంలో ఆలయంలో దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాయి దీక్ష సేవాసమితి సభ్యులు నందు, సోమేశ్వర్, రేఖ, రాణి, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఈ విత్తయినా ఆదుకునేనా?



లోకేశ్వరం మండలంలోని ధర్మోర, పంచగుడి, వట్టోలి, రాజూర గ్రామాల్లోని రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పంట తీసివేసి రబీలో మొక్కజొన్న, వేరుశనగ పంటలు వేస్తున్నారు. మహారాష్ట్ర నుంచి అనువైన విత్తనాలను తెప్పించి విత్తుతున్నారు. గురువారం ధర్మోరలో ఓ రైతు చేనులో మహిళా కూలీలు ఇలా మొక్కజొన్న విత్తనాలు విత్తుతూ కనిపించారు. - లోకేశ్వరం(ముధోల్)

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న చిలుక దేవిదాస్

ఎదులాపురం: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిలుక దేవిదాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజులుగా తుపాన్ ప్రభావం కారణంగా పత్తి, కంది, సోయా, వివిధ రకాల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు.

రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వరప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: రాజీమార్గంలోనే కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్ సూచించారు. గురువారం జిల్లా కోర్టులో పోలీస్ అధికారులతో జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. ఈ నెల 30వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికసంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా పోలీస్ అధికారులు చూపాలన్నారు. క్రిమినల్, ఎక్సైజ్, సివిల్, భూతగాదాలు, కుటుంబ తగాదాలు, బ్యాంక్ రికవరీ, చిట్‌ఫండ్ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకుంటే సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి డాక్టర్ పీ శివరాం, ఎస్పీ డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీళాజైన్, పీసీఆర్ కోర్టు జడ్జి తులసి దుర్గాలక్ష్మి, డీఎస్పీలు నాగేందర్, ఉమేందర్, టూ టౌన్ సీఐ అశోక్, రూరల్ సీఐ సైదారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రహణ మొర్రి బాధితులకు ఉచిత ఆపరేషన్లు



వైద్యశిబిరానికి హాజరైనవారితో వైద్యుడు

ఆదిలాబాద్‌టౌన్: గ్రహణ మొర్రి బాధితులకు అవసరమైన ఆపరేషన్లను ఉచితంగా చేయనున్నట్లు బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యుడు ముకుందరెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల ఆవరణలోని భవిత కేంద్రంలో ఆ ఆస్పత్రి, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉచిత గ్రహణ మొర్రి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. జిల్లాలోని 15మంది బాధితులు హాజరు కాగా, వారికి ఆయన పరీక్షలు నిర్వహించారు. పలువురిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెదవి, అంగిలి చీలిక లాంటి సమస్యలతో బాధపడే వారు ఇలాంటి వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో ఎంపిక చేసిన 15మందికి జనవరిలో శస్త్రచికిత్స నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి సుజాత్‌ఖాన్, ఐఆర్పీలు పాల్గొన్నారు.